

# రాధామోహనం

## - దేవరకొండ అన్నపూర్ణ



*ఇది ఒక అందమైన రాధామోహనగాథ. మనందరిలోను అంతర్లీనంగా ఉండి కాలప్రవాహంలో పడి మరిచిపోతున్న ప్రేమాభిమానాలనీ అనుభూతులని గుర్తు చేస్తూ, మనల్ని నవ్విస్తూ, అప్పుడప్పుడూ కళ్ళని చెమరుస్తూ, పనిలోపనిగా మరిచిపోతున్న విలువల్నీ మనుషులుగా మన బాధ్యతలనీ తట్టిలేపే కథామాలిక..!!*

12

## లాహిరి లాహిరి లాహిరిలో

డిసెంబర్ చలి హాయిగా పలకరిస్తుంటే పెరట్లో గ్రీన్ టీ తాగుతూ కూర్చుంది రాధ. సాయంత్రం నాలుగింటికి ఏర్పోర్ట్ లో రుక్మిణి, పిల్లలు కలుస్తారనీ, ఏడింటికి మయామీ ఫ్లైట్ అనీ గుర్తు చేసి మోహన్ టెన్నిస్ కి వెళ్ళాడు. రుక్మిణిని కలవబోతున్నానన్న ఆలోచన వచ్చిన ప్రతీ సారీ రాధ గుండెలో తెలియని అలజడి. వెనకనుంచి ఎమ్మెస్ సుబ్బులక్ష్మి గొంతులో మంద్రంగా పలుకుతున్న మోహనం -

**"చేరి యశోదకు శిశువితడు... ధారుణి బ్రహ్మకు తండ్రియునితడు"**

తన మోహన్ తన సొంతం అని తెలుస్తూనే ఉన్నా, తను ఎందుకిలా ఆలోచిస్తోంది అనే అనాలిసిస్ నుండి బయటపడలేకపోతోంది రాధ. మోహన్ రుక్మిణి స్థానంలో ఒక అబ్బాయి ఉన్నా అచ్చం ఇలాగే ప్రవర్తించి ఉండేవాడు. తను ఎంతమందికి ఎటువంటి సహాయం చేస్తానన్నా ఎప్పుడూ కాదనలేదు రాధ. అలాగే రుక్మిణి విషయంలో కూడా.

"ఆ అమ్మాయి ఒక్కతే ఉంది, ఒంటరిగా కెనడాలో ఉండేబదులు అమెరికా వచ్చేస్తే తాము కూడా తోడుండవచ్చు" అని మోహన్ చెబితే

“అటార్నీ జనరల్ గా పని చేస్తున్న అమ్మాయి ఒక్కతే ఉండలేదా? నలుగు పిల్లల్ని దత్తత తీసుకుని పెంచుకుంటున్న అమ్మాయికి ఆపాటి ఆత్మస్థైర్యం ఉండదా? ఇక్కడ వచ్చాక ఆ అమ్మాయికి ఎటువంటి సహాయం చేద్దామని మోహన్ రమ్మంటున్నాడు? రుక్మిణి తనతో మాట్లాడుతున్నపుడు మాటల్లో తడబాటుకి అర్థం ఏమిటి”

ఇలాంటి ప్రశ్నలు రాధని చుట్టుముడుతుంటే డోర్ బెల్ మోగింది.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★

అక్కడ కెనడా ఏర్పోర్ట్లో చెకిన్ చేసి బోర్డింగ్ ఎనౌన్స్మెంట్ కోసం ఎదురు చూస్తున్న రుక్మిణి బోర్డింగ్ పాస్ చేత్తో పట్టుకుని కూర్చుని ఉంది. పిల్లలు అందరూ ఫోన్స్ లో మునిగిపోయి ఉండగా తను మాత్రం రాధా మోహన్ ల ఆలోచనల్తో బిజీగా ఉంది. అంతలోనే సెల్ రింగ్ అయ్యింది. చూస్తే ‘మోహన్’.

“హలో”

“బోర్డింగ్ అయ్యిందా, ఆన్టైమ్ చూపిస్తోంది ఫ్లైట్”

“హా, లేదు వెయిటింగ్ టు బోర్డ్, మోహన్! నాకింకా ఇబ్బందిగానే..”

“డోంట్ వర్రీ రుక్మిణీ. రాధ అందరిలాంటి అమ్మాయి కాదు. నేను రాధ వేరు కాదు. షీ అండర్ స్టాండింగ్, సెన్సిబుల్ అండ్ ఫ్రెండ్లీ. వారం రోజుల్లో నువ్వే రాధకి ఫ్రెండ్ అయిపోయి నాతో మాట్లాడటం మానేస్తావ్ చూడు”

“అలాగే అంటావ్ నువ్వు.. నీ దగ్గర నా నంబర్ తీసుకున్నాక కృష్ణ నాకు ఫోన్ చేసింది. తను రాధకి టచ్ లోనే ఉందిట. చాలా సేపు మాట్లాడింది, మన కాలేజీ విశేషాలు రాధకు కూడా తెలుసు అంది నర్మగర్భితంగా నవ్వుతూ. ఆడపిల్లల హాస్టల్ కబుర్ల సంగతి నీకు తెలియదు మోహన్. చిలవలు పలవలు చేసి చెప్పుకుంటారు. రాధకు బాధ కలిగించకూడదు అన్నదే నా ఉద్దేశ్యం తప్ప – మీ అందరితో వెకేషన్ అంటే నాకింక అభ్యంతరం ఏముంటుంది చెప్పు. మీకెప్పటికీ ఆడవాళ్ల మనసు..”

“మళ్ళీ అదే మాట. జస్ట్ ట్రస్ట్ మీ, ఇట్స్ గోనా బీ ఫైన్”

“సరే, అదిగో బోర్డింగ్ అనౌన్స్మెంట్, బై, సీ యూ ఇన్ ద ఈవెనింగ్”

ఫోన్ పెట్టేసి హడావిడిగా బోర్డింగ్ లైన్ వైపు వెళ్ళింది రుక్మిణి.

★★★★★★★★★★★★★★★★★★★★

ఇంత పొద్దున్నే ఎవరయ్యుంటారు అనుకుంటూ స్క్రీన్ వైపు చూసింది రాధ. డోర్ దగ్గర ‘నీల్’, చేతిలో పెద్ద పూల బొకే. నీల్ రాధకి దూరపు చుట్టం. ఇక్కడే యూనివర్సిటీలో రిసెర్చ్ అసోసియేట్ గా పని చేస్తున్నాడు. చాలా సంవత్సరాలు యూకే లో ఉండి, ఈ మధ్యే అమెరికా వచ్చాడు. టెక్సాస్ వంటి ట్రాపికల్ ప్రదేశాలలో టిక్స్ వల్ల వ్యాప్తి చెందే రోగాలు, వాటికి

సంబంధించిన పరిశోధన కోసం ఇక్కడ యూనివర్సిటీ నుంచి పిలుపు రావడంతో రాధ ఉండే ఊరికే వచ్చాడు. రాధకన్నా నాలుగు సంవత్సరాలు పెద్దవాడు. పైగా బ్రహ్మచారి కూడా, సంపాదనంతా మెడికల్ రీసెర్చ్ గ్రూప్స్ కి ఇవ్వడం, చాలా చారిటీ కార్యక్రమాల్లో ముందుండడం ,నెలలో ఇరవై రోజుల పైగా ప్రయాణాల్లోనే ఉండటం ఇలాంటి కారణాల వల్ల తక్కువగానే కలుస్తాడు రాధామోహన్ లని. వెళ్ళి డోర్ తీసింది రాధ.

"హేయ్.. మోహన్ ఉన్నారా. క్రూజ్ వెళ్తున్నాం అని చెప్పారు నిన్న కాల్ చేస్తే.. మళ్ళీ దొరకరు ఎడ్వాన్స్డ్ విషెస్ చెబుదాం అని వచ్చా"

"హేయ్ నీల్, కమిన్. టెన్నిస్ కి వెళ్ళారు మోహన్. వచ్చేస్తారు రా కూర్చో. కాఫీ?"

"నో. మానేసాను కాఫీ. జస్ట్ వాటర్.. లేదంటే గ్రీన్ టీ. మేమూ అప్డేట్ అవుతున్నాం మేడం"

" ఓ వావ్. సరే. ఇంకేంటి విశేషాలు. ఏంటి వింటర్ బ్రేక్ ప్లాన్స్. మేము క్రూజ్ కి వెళ్తున్నాం. ఇక్కడే ఉంటావ్ అని తెలిసి ఉంటే జాయిన్ అవ్వమనే వాళ్ళం కదా"

"మోహన్ కాల్ చేసారు మూడు నెలల క్రితమే – క్రూజ్ కి నన్నూ రమ్మని. వింటర్ బ్రేక్ అంతా ఆస్టిన్, సేన్ ఆంటోనియో వైపు టిక్స్ కలెక్ట్ చేసుకోవడానికి నాలాంటి సింగిల్స్ బేచ్ ఆఫ్ రిసెర్చర్స్ వెళ్ళాలి అని ముందే ప్లాన్ చేసాం అందుకని కుదరదు అని చెప్పాను. కానీ ఈ వారం మాకు సీ డీ సీ డైరెక్టివ్ వచ్చింది. ఎక్కడికీ కదలద్దు అని. అసలు మీరు కూడా క్రూజ్ కి వెళ్ళటం రిస్క్ రాధమ్మా. మోహన్ కి చెప్పాలి. కానీ తన బర్త్డే కి క్రూజ్ అనుకున్నారేమో అని నిన్న కాల్ చేసినా చెప్పలేకపోయాను. అడ్వాన్స్డ్ విషెస్ చెప్పి నా వంతు ఒకసారి చెప్పి చూద్దాం అని వచ్చాను"

"మేమూ చూసాం డైరెక్టివ్ మెయిల్. కోవిడ్ కేసెస్ రైజ్ అవుతున్నాయి కదా టెక్సాస్ లో. మేము వాక్సినేటెడ్ కదా, కిడ్స్ ఆర్ సేఫ్ అని ధైర్యంగా ఉన్నాం."

"వద్దు రాధమ్మా. అది నా ఏరియా కనుక చెప్తున్నా. మా టీం లో అంతా వాక్సిన్స్ అయ్యాక బ్లడ్ సాంపిల్స్ డ్రా చేసి ఆంటిబాడీ టెస్ట్ చేస్తే అంత ఎక్కువ కనబడలేదు. వాక్సిన్ రెండో డోస్ పడ్డాక కానీ మనం సేఫ్ కాదు. పిల్లలు కూడా వల్నెరబుల్ కదా."

నీల్, రాధ మాటల్లో ఉండగా మోహన్ వచ్చాడు. "హేయ్ నీల్. ఎలా ఉన్నారు" అంటూ

"ఆల్ గుడ్, అడ్వాన్స్డ్ బర్త్ డే విషెస్" అంటూ బొకే ఇచ్చాడు నీల్

"హేయ్ థాంక్స్. ప్లీజ్ ఎక్స్క్యూజ్ మీ. ఒక్క పది నిముషాలు. ఫ్రెష్ అయి వస్తా, బ్రేక్ ఫాస్ట్ చేస్తూ మాట్లాడుకుందాం"

మోహన్ స్నానం చేసి వచ్చాక బ్రేక్ ఫాస్ట్ టేబిల్ దగ్గర కూర్చుని నీల్ తో క్రూజ్ గురించి మాట్లాడుతూ

“మీ ప్లాన్స్ కాన్సిల్ కనుక ఇక్కడికి వచ్చెయ్యండి నీల్, కెనడా నుంచి నా చైల్డ్ హుడ్ ఫ్రెండ్ కూడా వస్తోంది. న్యూ ఇయర్ డే దాకా ఇక్కడే స్పెండ్ చేద్దాం. నాకు కూడా క్రూజ్ రిస్కీ అనిపించినా గెటవే కావాలనిపించి వెళ్దామనుకున్నా. బట్ యు హేవ్ ఎ పాయింట్.” అన్నాడు మోహన్

“ష్యూర్. వై నాట్” అన్నాడు నీల్.

అలా క్రూజ్ ట్రిప్ కాన్సిల్ కావడంతో పిల్లలు కొంత డిసప్పాయింట్ అయినా వాళ్ళకీ 2020 ఎలా గడిచిందో తెలియడంతో తొందరగానే సర్దుకుని ఏమేమి సినిమాలు చూడాలి, రుక్మిణి అండ్ కిడ్స్ ని ఏ రూమ్స్ లో ఎకామిడేట్ చెయ్యాలి అని ప్లానింగ్ మొదలు పెట్టేసారు అప్పుడే.

సాయంత్రం ఏర్పోర్ట్ కి వెళ్ళి రుక్మిణిని, పిల్లలని పికప్ చేస్కుని ఇంటికి వచ్చారు మోహన్ & నీల్.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

రుక్మిణికి మోహన్ చేంజ్ ఆఫ్ ప్లాన్ చెప్పగానే “సరే” అన్నప్పటికీ కార్ లో కూర్చున్నప్పటి నుంచీ ఇల్లు చేరేవరకూ ఆలోచనల్లో ఉండి మోహన్ నీల్ మాట్లాడుకుంటుంటే సరిగా వినలేదు కూడా.

వేన్ దిగగానే పిల్లలు లగేజ్ అంతా దింపడానికి హెల్ప్ చేస్తుంటే రుక్మిణి మాత్రం అక్కడ ఫ్రంట్ యార్డ్ అంతా పూసిన ఏంజిల్స్ ట్రంపెట్ లు అందంగా పలకరిస్తుంటే మురిపెంగా చూస్తూ నిల్చుంది. మోహన్ దగ్గరికి వచ్చి

“రాధ కూడా గార్డెన్ లవర్.. నీలాగే. లోపలికి వెళ్దాం రా” అన్నాడు

పెద్దమ్మాయి సుధేష్ణ కళ్ళెగరేస్తూ “మామ్ & ఫ్లవర్స్ – కైండా ఇన్స్పైరబుల్. షీ టాక్స్ టు దెమ్” అంది సన్నగా నవ్వుతూ. చిన్నది చారుమతి తన వయసు అమ్మాయి ఇక్కడ ఉంది అన్న ఎక్సైట్మెంట్ తో డోర్ దగ్గరకి పరిగెత్తింది. డోర్ నాక్ చెయ్యకుండానే డోర్ ఓపెన్ అయ్యింది.

ఫొటోల్లో చూసినదానికన్నా చాలా బావుంది రాధ. చెంపకు చారెడన్నట్లున్న కళ్ళు, స్ఫుటమైన కనుబొమ్మలు, ప్రశాంతమైన చిరునవ్వు, లేత పసుపు ఆర్గంజా చీరలో మెరిసిపోతోంది రాధ. పరిగెట్టుకొచ్చి తల్లి కొంగు వెనక్కాల నుంచి తొంగి చూస్తున్న ఏడేళ్ళ పిల్లవాడు. అచ్చు మోహన్ లాగే ఉన్నాడు – అనుకుంది రుక్మిణి.

“వెల్కమ్ రుక్మిణి. సో నైస్ టు మీట్ యూ” అంది రాధ.

“ సేం హియర్ రాధా, రేర్ ఫ్లవర్స్ చూసాను మీ ఫ్రంట్ యార్డ్ లో. సో గ్లాడ్ టు సీ యువర్ గార్డెన్ టూ” అంది రుక్మిణి.

పిల్లలు లోపలికి వచ్చి సెటిల్ అయ్యేలోపు రుక్మిణి గోడల మీద ఫొటోలు, శ్రద్ధగా సర్దిన బుక్ షెల్ఫ్స్లో పుస్తకాలు, అవార్డ్స్, ట్రోఫీస్ అన్నీ చూస్తూ లోపలికి వచ్చింది.

ముందుగా ప్లాన్ చేస్కున్నట్లే నీల్ పిల్లలు నలుగుర్నీ రెండు బెడ్ రూమ్స్ లో సెటిల్ చేసి, రుక్మిణి లగేజీ రెండో గెస్ట్ బెడ్రూం లో పెట్టి క్రిందకి వచ్చాడు. మోహన్ రుక్మిణి దగ్గరికి వచ్చి

“రుక్మిణీ – హీ ఈజ్ నీల్, రాధ కజిన్. నీలాగే చారిటీకి జీవితం అంకితం చేసేసారు.ఐ ఫీల్ యు హేవ్ ఎ లాట్ ఇన్ కామన్ ” అని నవ్వి

“నీల్, దిస్ ఈజ్ రుక్మిణీ, మై చైల్డ్ హుడ్ బెస్టీ” అన్నాడు నీల్ వైపు చూస్తూ.

“హల్లో రుక్మిణీ, మోహన్ గురించి మీకు తెలుసుగా, అలాగే చెప్తాడు అందరి గురించీ. నేనిక్కడ ఒక వైరల్ వాక్సిన్ డిస్కవరీ అండ్ ట్రాన్స్లేషనల్ మెడిసిన్ గ్రూప్ లో పని చేస్తున్నా. నీల్ అంటారు నన్ను. గుడ్ టు సీ యూ” అన్నాడు నీల్.

“అవునట కదా, అక్కడ గ్లోబల్ హెడ్ అనీ భూమి మీద కన్నా గాలిలో ఎక్కువగా తిరుగుతుంటారనీ, అచ్చం వైరస్ లా .. అని చెప్పాడు. మీ గురించి చాలానే చెప్పాడులెండి మోహన్. మీరు కష్టపడద్దు” అని తేలికగా నవ్వింది రుక్మిణి.

“వైరస్ లా.. హహ. అనాలనుకున్న నాలుగూ అనెయ్యి రుక్కూ. మధ్యలో నేనన్నానంటూ నా పేరు ఎందుకూ” అంటూ మోహన్ రాధ వైపు తిరిగి

“రాధా, వాళ్లందరూ ఫ్రెష్ అయ్యి వచ్చేలోపు మనం వాక్ కి వెళ్లి వద్దాం రా. ఇవాళ డిన్నర్ నీల్ స్పెషల్ కదా. మనకి రెస్ట్. నీల్! కిచెన్ ఈజ్ ఆల్ యువర్స్” అన్నాడు.

“సరే, రుక్మిణీ మీకు టవల్స్ అవీ క్లోసెట్ లో నే ఉంటాయి. ఫ్రెష్ అయ్యి రండి. ఈ లోపు నేను – మోహన్ వెళ్ళి క్విక్ వాక్ పూర్తి చేసి వస్తాం” అంది రాధ.

“అలాగే” అని లోపలికి వెళ్ళింది రుక్మిణి.

ఈ లోపు స్నానం చేసి వచ్చారు పిల్లలు నలుగురూ. పెద్దమ్మాయి సుధేష్ణ చక్కగా తెలుగు మాట్లాడటమే కాదు – వంటింట్లోకి వచ్చి “ఈజ్ దేర్ ఎనీథింగ్ ఐ కెన్ హెల్ప్ విత్” అని నీల్ తో మాట్లాడుతుంటే ముచ్చటగా అనిపించింది రాధకి. ప్రద్యుమ నీ, మోహన్ నీ చిన్నూ గేం రూం లోకి తీసుకెళితే, చారుమతిని శ్రీనిథి తన రూమ్లోకి తీసుకుని వెళ్లింది. వాళ్లవైపుచూసి తల ఊపి మోహన్ వైపు తిరిగింది రాధ.

బయటికి దారి తీసిన మోహన్ ని అనుసరిస్తూ –

“సో దిస్ ఈజ్ యువర్ మాస్టర్ ప్లాన్. డూ యూ థింక్ షీ విల్ కన్సిడర్?” అంది రాధ.

“ట్రై చేద్దాం. మనకి తెలిసినంత వరకూ ఇద్దరూ మంచి వాళ్లు. వాళ్లిద్దరూ పెళ్ళి చేసుకోవాలి అని ఏం లేదు. కంపానియన్ షిప్ అయినా నాకు పర్లేదు. ఇంకో నాలుగేళ్ళలో పిల్లలు అందరూ కాలేజీలని వెళ్ళిపోయాక రుక్మిణి ఒంటరి అయిపోదూ. నీల్ మాత్రం ఎన్నాళ్ళిలా ఒంటరిగా ఉంటాడు?” అన్నాడు మోహన్.

“నీల్ గురించి మీకు చెప్పాను కదా స్వామీ. తనకి కొంత బేగేజ్ ఉంది కదా. వాళ్లు ఇద్దరూ క్లిక్ ఐతే మంచిదే మరి. మీరు ఇంత ప్లాన్ వేసారని అసలు నాకు క్లూ కూడా లేదు. ఇంతకీ ఏమిటి సడెన్ గా వాకింగ్ అని బయటికి తీసుకొచ్చారు. ఏమిటి సంగతి?”

“మొదటిది – రుక్మిణి అమెరికా మూవ్ అవ్వాలి అంటే నీతో కొంత కంఫర్టబుల్ అవ్వాలి. నీకు కృష్ణ ఏమి చెప్పిందో నువ్వు తన గురించి ఏమనుకుంటున్నావో అని చాలా హెసిటేట్ చేస్తుంటే నేనే పుష్ చేసి ఈ ట్రిప్ ప్లాన్ చేసా. రెండవది – నీల్ తో పరిచయం పెరిగితే – వాళ్లు ఒకే బోట్ లో ఉన్నారు, ఇద్దరూ ఒకేలాంటి ఐడియాలజీస్ ఉన్నవాళ్ళు – ఒకరికొకరు తోడుంటారు, మనం కూడా దగ్గర్లో ఉంటే రుక్మిణి లైఫ్ బాగుంటుంది అన్న సెల్ఫిష్ నెస్ నాది.

రమణ మహర్షి అంటారుగా **జరగాల్సింది జరిగి తీరుతుంది మనం ఆపలేము, జరగకూడనిది మనం ఎంత ప్రయత్నించినా జరగదు. మన వంతు మంచి అనుకున్న పని చేసి ఫలితం ఆశించకుండా ఉండటమే మన కర్తవ్యం**. లక్కీగా నీల్ రావడం, ట్రిప్ కాన్సిల్ అవ్వడం ఓ వారం రోజులు మనందరికీ టైం దొరకడం ఇవన్నీ యాదృచ్ఛికం అనుకోను. డివైన్ ఇంటర్వెన్షన్ అంటే ఇదేనేమో. చూద్దాం. మనం పిల్లల్ని ఎంగేజ్ చేసి కాన్షియస్ గా వాళ్లకి కొంత టైం ఇద్దామన్నది నా ఐడియా. మా రాధమ్మది నా కన్నా చురుకైన బుర్ర కదా. ఎలా ఏమిటీ అని సలహా అడుగుదామని వాక్ కి తీసుకొచ్చానమ్మా”

“బాగుంది. సీక్రెట్ గా మాస్టర్ ప్లాన్లు వేసేది తమరు. మళ్ళీ నాకు క్రెడిట్ ఇవ్వడం ఒకటి. మీ ప్లాన్ అంతా బాగానే ఉంది కానీ ఇన్నాళ్ళుగా ఎంతోమంది తారసపడిఉంటారు రుక్మిణికి. తను అలా ఒంటరిగా ఉండిపోవాలన్న నిర్ణయం వెనుక కారణాలేమిటి అన్నది తెలిసుకోవాలి ముందు. నేనూ కొంత అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. తను ఎంత ఓపెన్ గా మాట్లాడుతుందో తెలియదు కానీ ఇప్పటిదాకా ఐతే గలగల పారే గోదారిలాగే అనిపించింది. లోపల ఎన్ని అగ్ని పర్వతాలు దాగున్నాయో మనకింకా తెలియదు. వాళ్లిద్దరికీ కొంత సమయం క్రియేట్ చెయ్యటం కూడా మంచి ఐడియానే. చూద్దాం హౌ ఇట్ ఆల్ అన్ఫోల్డ్స్”

అలా మాట్లాడుకుంటూ ఇంటికి తిరిగి వచ్చేసరికి స్నానం చేసి మెట్లు దిగుతూ కనబడింది రుక్మిణి. వంటింట్లో సుధేష్ణ, నీల్ కబుర్లు చెప్పుకుంటూ ఏదో మిడిల్ ఈస్ట్రన్ క్విజిన్ రెడీ చేస్తున్నారు. రాధ రుక్మిణి దగ్గరికి వెళ్ళి

“కూర్చోండి, మనం ఇవాళ్టికి రెస్ట్, లెట్ ద గయ్స్ ఫిగరౌట్ ద డిన్నర్స్” అంది

“బేక్ యార్డ్లో కూర్చుందామా, ఐ వాంట్ టు ఫీల్ యువర్ వరల్డ్” అన్న రుక్మిణి మాటలకి సరేనని తలూపి పెరట్లోకి దారి తీసింది రాధ.

చాలా సేపు పూల మొక్కల గురించి, కాయగూరల గురించి మాట్లాడుకుంటూ ఉండిపోయారు ఇద్దరూ. సంభాషణలో రుక్మిణి అలర్ట్ గా ఉండటం రాధ దృష్టిని దాటిపోలేదు. మోహన్ వచ్చి డిన్నర్కి పిలవడంతో లోపలికి వచ్చారు. సుధేష్ణ వచ్చి

“ అమ్మా! అంకుల్ నీల్ టాట్ మీ న్యూ క్విజిన్. నువ్వు టేస్ట్ చెయ్యి” అంటూ టేబిల్ దగ్గరకి లాక్కెళ్ళింది. ఒక్క బైట్ తిని

“హ్మ్మ్ ! వెరీ గుడ్. నీల్, మీరు మంచి కుక్. ఐ లైక్ మిడిల్ ఈస్ట్రన్ ఫుడ్” అంది రుక్మిణి

నీల్ కళ్ళల్లో చిన్న మెరుపు మెరిసి మాయమయిందని గమనించింది రుక్మిణి. భోజనాల టైం లో రాధ అందరికీ వడ్డించి కూర్చున్నాక, మోహన్ రాధకి పిల్లలందరికీ అడిగి అడిగి వడ్డించడం గమనించి సుధేష్ణ రుక్మిణి వైపు రెండు మూడు సార్లు చూడటం, అది గమనించి నీల్ రుక్మిణికి ఏమి కావాలో అడిగి వడ్డించటం జరిగాయి. భోజనాల చివర్లో “రేపు నాసా స్పేస్ సెంటర్ చూపిద్దాం సుధేష్ణ వాళ్లందరికీ. నీల్, మీరు వెళ్తారా పిల్లలతో

“శ్రీలమ్మా, కెన్ యూ బీ ద గైడ్ టుమారో” అన్నాడు మోహన్.  అలాగే అంటూ తలూపింది శ్రీనిధి. నీల్ కూడా “ష్యూర్” అన్నాడు భుజాలెగరేస్తూ.

“రుక్మిణీ, నాసా స్పేస్ సెంటర్ లో డిసెంబర్ స్పెషల్ లైట్ షో ఉంటుంది. జింకలు నెమళ్ళు కూడా ఉంటాయి. చక్కటి ప్లేస్ అది. మేము రెగ్యులర్ గా వెళ్తుంటాం కనుక రావట్లేదు కానీ మీరు వెళ్లండి. యు విల్ లవిట్”

అంది రాధ రుక్మిణి వైపు చూస్తూ. రుక్మిణి మోహన్ వైపు చూసింది ప్రశ్నార్థకంగా. మోహన్ తల నాడ్ చేసాడు.

“వైనాట్! అలాగే, పాపం నేను వెళ్ళి వైరస్ కి వైరల్ ఫీవర్ తెప్పిస్తానేమో అని కొంత ఆలోచించాను అంతే” అంది హాయిగా నవ్వేస్తూ.

“అంత అదృష్టమా” అంటూ నీల్ డ్రమాటిక్ గా  క్లాప్ చేస్తే పిల్లలందరూ ‘యాయ్! నాసా టుమారో” అని అరిచారు.

డిన్నర్లయ్యి పిల్లలందరూ పైకి వెళ్ళిపోయాక నలుగురూ ఫైర్ ప్లేస్ దగ్గర కూర్చుని ఉండగా మోహన్ ఇదే కదా మన క్రూజ్ అంటూ

**“లాహిరి లాహిరి లాహిరిలో ఓహో జగమే ఊగెనుగా తూగెనుగా”**

అని పాటందుకుంటే

“ చిన్నప్పటి నుంచీ అంతే. మాయ చేసి చివరకు అన్నింటినీ తనకు అనుకూలంగా మలచేసుకుంటాడు మోహన్. క్రూజ్ అని చెప్పి రప్పించి ఇంట్లో కూర్చోబెట్టి వైరస్ కి ఎక్స్పోజ్ చేయడమే కాక, ఇదే క్రూజ్ అని మనందరిమీద మోహనాన్ని వదలడం ఒకటీ”

అని రుక్మిణి ఉడికించింది. నీల్, రాధ కూడా పాటలు అందుకోవడంతో కాస్సేపు పాటల కచేరీ నడిచింది లేట్ నైట్ వరకూ.

రుక్మిణితో – "నీల్ అద్భుతంగా మృదంగం వాయిస్తాడు. నువ్వు రాధా ఇద్దరూ పాడుతూ, నేను ఫ్లూట్, రాధ వీణ, శ్రీనిధి పియానో – మనమొక చిన్న కాన్సర్ట్ ప్లాన్ చేద్దాం ఎల్లుండి. మంచి కాన్సెప్ట్ అనుకుని చెప్పండి నువ్వు, నీల్ ఇద్దరూ కలిసి" అన్నాడు.

"మా సుధేష్ణ గిటార్, మావాడు మోహన్ కూడా ఫ్లూట్ ప్లే చేస్తారు. తప్పకుండా" అంటున్న రుక్మిణి, నీల్ ముఖకవళికలు మారడం గమనించి ఆగింది.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

*(వచ్చే నెల మరో మోహనం)*

Post your comments